



ఉరేసుకున్న ముగ్గురి మృతదేహాలు

విషాదం

- కుటుంబాన్ని బలిగొన్న ఆన్‌లైన్ బెట్టింగ్
- అప్పులపాలై ముగ్గురు ఉరేసుకుని ఆత్మహత్య
- ఎడపల్లిలోని వడ్డాపల్లిలో విషాద ఛాయలు

ఎడపల్లి, అక్టోబరు5: ఆన్‌లైన్ బెట్టింగ్ మోజులో లక్షల రూపాయలు అప్పుల పాలైన ఓ కుటుంబం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన జిల్లాలోని ఎడపల్లి మండలం వడ్డాపల్లిలో శుక్రవారం అర్ధరాత్రి విషాదం నింపింది. వివరాల్లోకి వెళ్తే.. వడ్డాపల్లికి చెందిన రంగనవేని సురేష్ చిన్న కిరాణా కొట్టుపై వచ్చిన ఆదాయంతో భార్య హేమలత, కుమారుడు హరీష్‌లను పోషించుకుంటున్నాడు. కరోనా సమయం నుంచి రంగనవేని హరీష్ ఆన్‌లైన్ పేకాట బెట్టింగ్‌కు అలవాటు పడ్డాడు. బెట్టింగ్ కోసం రూ.5లక్షలు అప్పు కాగా, దాన్ని తీర్చేందుకు మరో అప్పు చేసి ఇలా కుటుంబంపై సుమారు రూ.20 లక్షలకుపైనే రుణ భారం పడింది. వారికున్న అర ఎకరం పొలం అమ్మినా అప్పులు తీరకపోవడం, రుణం ఇచ్చినవారు డబ్బులు ఇచ్చేయాలని ఒత్తిడి పెరిగింది. ఇవే కాకుండా గుడిసె తీసేసి ఇల్లు కట్టుకునేందుకు రూ.12లక్షలతో ఇల్లు కట్టడం ప్రారంభించాడు. ఆ డబ్బు సరిపోదని ఇంటి స్థలాన్ని తాకట్టు పెట్టి ఓ ప్రైవేటు ఫైనాన్స్ నుంచి రూ.6లక్షల అప్పుగా తీసుకున్నాడు. ఇచ్చిన డబ్బులకు వడ్డీ వ్యాపారులు మూడింతలు చేసి వారి వద్ద ఉన్న ప్లాటు దక్కుతుందని అనుకున్నారు. కానీ ఫైనాన్స్ వారికి తాకట్టు ఉన్న విషయం తెలియడంతో డబ్బులు చెల్లించాలని శుక్రవారం సాయంత్రం పట్టు బట్టారు. దీంతో మనస్థాపానికి చెందిన ఆ కుటుంబంలోని ముగ్గురు రంగనవేని సురేష్ (53), హేమలత (48), హరీష్ (25) చీరలతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్న మృతికి గల కారణాలను సేకరించి మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ శ్రీనివాస్, బోధన్ రూరల్ సీఐ విజయ్, ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు బోధన్ ఏసీపీ శ్రీనివాస్ తెలిపారు.

వడ్డాపల్లిలో విషాద ఛాయలు

ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆన్‌లైన్ బెట్టింగ్ మోజులో ఆత్మహత్య చేసుకోవడంతో వడ్డాపల్లి గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. అందరితో కలుపుగోలుగా ఉండే సురేష్. తన కొడుకు చేసిన తప్పునకు కుటుంబంతో సహా ఆత్మహత్యకు పాల్పడడాన్ని గ్రామస్థులు జీర్ణించుకోలేకపోతున్నారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బలి తీసుకుంటున్న

బెట్టింగ్ భూతం!



- జిల్లాలో ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బలైపోతున్న కుటుంబాలు
- సరదా కాస్త వ్యసనంగా మారుతున్న వైనం
- అత్యాశకు పోయి రూ.లక్షలు నష్టపోతున్న అమాయకులు
- అప్పుల పాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్న బాధితులు

నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 5: చక్కటి కుటుంబం.. పిల్లాపాపలతో సంతోషంగా గడపాల్సిన జీవితాలను ఆన్‌లైన్ ఆటలకు అలవాటుపడి తక్కువ కాలంలో ఎక్కువ డబ్బులు సంపాదించుకోవచ్చుననే దురాశతో కొందరు అమాయకులు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్న పరిస్థితి నెలకొంది. శనివారం ఎడపల్లి మండలం వడ్డేపల్లిలో ఆన్‌లైన్ బెట్టింగ్‌కు ఓ కుటుంబం బలైన ఘటన వెలుగులోకి వచ్చింది. కొడుకు చేసిన అప్పులకు తల్లీ, తండ్రి ముగ్గురు బలవనర్మారణానికి పాల్పడటం జిల్లాలో చర్చనీయాంశమైంది. ఇలా ఎన్నో కుటుంబాలు ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బలవుతున్నారు. ఒక్కటికి పదింతల లాభం వస్తుందని ఆశపెట్టి మనుషులను నిలువుదోపిడి చేసే గ్యాంబ్లింగ్, బెట్టింగ్‌లను నిషేధించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వివిధ అధ్యయనాల ప్రకారం దేశవ్యాప్తంగా ఏడాదికి రూ. 8.39లక్షల కోట్ల మేరకు అక్రమ బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. ఆన్‌లైన్ జూదా క్రీడల్లో ప్రతీరోజు భారతీయులు 14కోట్ల మంది వరకు పాల్గొంటు న్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. ఐపీఎల్ సమయంలో అయితే 37 కోట్ల వరకు భారతీయులు ఆన్‌లైన్ బెట్టింగ్‌లలో పాల్గొంటున్నట్లు తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం కొన్ని యాప్‌లపై నిషేధం విధించినప్పటికీ క్షేత్రస్థాయిలో చట్టాలు కఠినంగా లేకపోవడంతో వాటిని సొమ్ముగా చేసుకొని సైబర్ నేరస్థులు అమాయక ప్రజలను మోసం చేస్తున్నారు. ముఖ్యంగా యువత ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు మోసపోతున్నారు. తెలిసీ తెలియని వయస్సులో ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లు చేస్తూ మోసపోయి కుటుంబానికి చెప్పుకోలేక అప్పు తీర్చలేక అనేకమంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. జిల్లాలో గత ఆరు నెలల కాలంగా సైబర్ క్రైమ్ కింద 58 కేసులు నమోదయ్యాయి. నిత్యం ఎవరో ఒకరు సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుతున్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లపై కూడా పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో ఆన్‌లైన్ బెట్టింగ్ విషయంలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

యువత, విద్యార్థులపై వల

ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు ముఖ్యంగా యువత, విద్యార్థులే లక్ష్యంగా వల వేస్తున్నారు. ఉన్నత ఉద్యోగాల్లో ఉన్న యువతీ యువకులను టార్గెట్ చేస్తూ వల వేస్తున్నారు. బెట్టింగ్, గ్యాంబ్లింగ్‌పై ప్రభుత్వం నిషేధం విధించినప్పటికీ సైబర్‌క్రైం నేరాలు మాత్రం రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఆన్‌లైన్ బెట్టింగ్‌లను నియంత్రించాల్సింది రాష్ట్ర ప్రభుత్వాలేనని కానీ వెబ్‌సైట్‌లన్నీ కేంద్రం పరిధిలో ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్న యాప్‌లపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడుతున్నాయి. ఇప్పుడు ప్రతీ ఒక్కరి చేతిలో సెల్ ఫోన్‌లు రావడంతో సైబర్ నేరాలు కూడా విపరీతంగా పెరుగుతున్నాయి. గతంలో మహా నగరాలకే పరిమితమైన బెట్టింగ్ క్రీడా ఇప్పుడు గ్రామాల వరకు విస్తరించడం చూస్తుంటే సైబర్ నేరాలు అంతలా పెరిగిపోతు న్నాయి. బెట్టింగ్‌లలో మొదట కొంత లాభాలు చూపెడుతూ యువతను అటువైపు లాగుతున్న సైబర్ నేరగాళ్లు తర్వాత నష్టాలను చూపుతున్నారు. ఆ నష్టాలను పూడ్చడానికి తిరిగి అప్పులు చేస్తూ యువతతో పాటు పెద్దవారు కూడా సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కి మరింత అప్పుల్లో కూరుకుపోతున్నారు. అప్పులు తీర్చలేక పది మందిలో మొఖం చూపెట్టలేక చాలా మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. జిల్లాలో అనేక మంది నిత్యం సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కి ఇబ్బందులు పడుతున్నారు. పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగినప్పటికీ కేవలం కేసు నమోదే తప్ప డబ్బులు తిరిగి వచ్చిన దాఖలాలు కనిపించడం లేదు. ఫేస్‌బుక్ హ్యాకింగ్, ఇన్‌స్టాగ్రామ్ హ్యాకింగ్, ఓటిపి నెంబర్లను తెలుసుకుంటూ అనేక మంది సైబర్ నేరగాళ్లు డబ్బులను దోచుకుంటున్నారు. కొందరు మహిళల పేరుతో వీడియోకాల్స్ చేస్తూ యువకులను మోసం చేస్తూ వారి వీడియోలను బయటపెడ తామంటూ సైబర్ నేరగాళ్లు వారి నుంచి డబ్బులు వసూలు చేసిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. బయటకు చెప్పుకోలేక సైబర్ నేరగాళ్ల అడిగిన డబ్బులు ఇచ్చి అనేక మంది యువకులు మోసపోయారు. నగరంలో గతంలో ఓ యువకుడు ఇలాగే మోసపోయి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

అప్రమత్తంగా ఉండాలి

ఆన్‌లైన్ బెట్టింగ్ విషయంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లక్కు కుదిరితే గెలుస్తాము తప్ప ఆన్‌లైన్ బెట్టింగ్‌లో ఎక్కువ శాతం డబ్బులు కోల్పోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. క్రికెట్, ఫుట్‌బాల్ మ్యాచ్‌లపై బెట్టింగ్ వేయడం, ఆన్‌లైన్‌లో క్యాసినో, గ్యాంబ్లింగ్, బెట్టింగ్ లాంటి విషయంలో జాగ్రత్తగా ఉండాలని నిపుణులు చెబుతున్నారు. ఇటీవల కొందరు సెలబ్రిటీల పేరుతో బెట్టింగ్ యాప్‌లను పాపులర్ చేస్తూ యువతను ఆకట్టుకుంటున్నారు. ఆఫర్లు, బోనస్‌లు, డిస్కౌంట్‌లు అంటూ ప్రచారం చేసుకుంటూ రిఫరల్ కోడ్‌లు ఇచ్చి లింక్‌లపై క్లిక్ చేసి జాయిన్ కావాలని అడుగుతారు. తమ యాప్‌ల ద్వారా ఇంత సంపా దించాము, అంత సంపాదించాము అంటూ ప్రచారం నిర్వహిస్తూ ఎలాగై నా గేమ్ ఆడేలా యువతను ప్రేరేపిస్తున్నారు. నకిలీ ప్రకటనలతో వల వేస్తూ ఒక్కసారి ఆడితే రెట్టింపు మొత్తంలో డబ్బులు గెలవచ్చునని కొన్ని డబ్బులు డిపాజిట్ అయినట్లు స్క్రీన్‌షాట్‌లు చూపిస్తూ యువతను తమవైపు లాగుతున్నారు. వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తూ ఫేక్ యాప్ లను డౌన్‌లోడ్ చేసుకునేలా మోసం చేస్తున్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లలో ముఖ్యంగా బోనస్ ట్రాప్స్ ఎక్కువగా జరుగుతున్నాయి. పందెం కట్టిన దానికంటే ఎక్కువ గెలవచ్చునంటూ డబ్బులు డిపాజిట్ చేసుకొని గెలిచిన తర్వాత డబ్బును విత్‌డ్రా చేయడానికి ప్రయత్నిస్తే నో క్యాష్ అంతా ట్రాష్ ల మోసం చేస్తున్నారు. దేశంలో సైబర్ చట్టాలు కట్టుదిట్టంగా ఉన్నప్పటికీ ఇతర దేశాల నుంచి హ్యాకర్లు మోసాలకు పాల్పడుతున్నారు. ఇంటర్నే షనల్ ఆర్థిక నేరాలను ట్రాక్ చేయడం కష్టమవుతుండటం వల్ల యువత మోసపోతున్నారు.

యువత అప్రమత్తంగా ఉండాలి

- నరేంద్రచారి, సీసీఎస్ ఏసీపీ, నిజామాబాద్

సైబర్ నేరగాళ్ల విషయంలో ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలి. ఆన్‌లైన్ బెట్టింగ్ విషయంలో ఎవరి నియంత్రణలో వారు ఉండాల్సిన అవసరం ఉంది. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. కాలక్షేపానికి ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతూ యువత సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుతున్నారు. దీనివల్ల అప్పులపాలై ఇబ్బందులు పడుతున్నారు. తల్లిదండ్రులు సైతం పిల్లలు ఆన్‌లైన్ గేమ్స్ యాప్స్ విషయంలో జాగ్రత్తగా ఉండాలి.

జిల్లా అభివృద్ధికి

ప్రత్యేక ప్రణాళిక

- జిల్లాలో మరో మెడికల్ కళాశాల ఏర్పాటుకు కృషి
- విద్యా, వైద్య, క్రీడా రంగాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి: టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్



మాట్లాడుతున్న మహేష్‌కుమార్‌గౌడ్

నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 5: జిల్లా అభివృద్ధికి టీపీసీసీ అధ్యక్షుడిగా తనవంతు సహకారం ఉంటుందని జిల్లాలో మరో మెడికల్ కళాశాల ఏర్పాటు అవసరం ఉందని 2025 నాటికి సీఎంసీ కాలేజీని ఏర్పాటు అయ్యేలా సీఎంతో మాట్లాడి కృషి చేస్తానని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. శనివారం నగరంలోని వంశీ హోటల్‌లో మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ నిర్వహించారు. టీపీసీసీ అధ్యక్షుడిగా నియామకమైన తర్వాత మొ దటిసారి జిల్లాకు వచ్చిన తనకు జిల్లా ప్రజలు, నాయ కులు ఘనస్వాగతం పలకడం మర్చిపోలేనన్నారు. జిల్లాలోని జర్నలిస్టులతో తనకు అనుబంధం ఉందని అందరి సహకారం వల్లే తాను ఈ స్థాయికి వచ్చానన్నారు. జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలను ఇంజనీరింగ్ కళాశా లగా అప్‌గ్రేడ్ చేశామని, అలాగే మహిళా డిగ్రీ కళాశాల, మరిన్ని మహిళా ఇంటర్ కళాశాలలు ఏర్పాటు చేసేందు కు కృషి చేస్తానన్నారు. జిల్లాలో క్రీడలకు ప్రాధాన్యం ఇస్తామని సీఎం సైతం క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారని అన్నారు. ఒక క్రీడాకారుడిగా జిల్లా కేంద్రంలో పాత కలెక్ట రేట్ మైదానంలో స్టేడియం నిర్మాణం కోసం కృషి చేస్తానన్నారు. మరిన్ని స్టేడియాలను నిర్మిస్తామన్నారు. నిజామాబాద్ జిల్లాలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు విషయం కేంద్రం పరిధిలో ఉందని సాధ్య సాధ్యాలను పరిశీలించి ఎయిర్ పోర్టు ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. నిజామాబాద్ నగరం స్మార్ట్ సిటీలో ఉండాల్సిందేనని సాంకేతికంగా అన్ని అంశాలు ఉన్నా కేంద్రం నిజామాబాద్‌ను స్మార్ట్ సిటీగా ప్రకటించలేదని కొందరి అసమర్థత వల్లే అది సాధ్యం కాలేదన్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ త్వరితగతిన పూర్త య్యేలా చూస్తామని నిజామాబాద్‌కు మాస్టర్‌ప్లాన్ అవసరం ఎంతైనా ఉందన్నారు. మాధవ నగర్ ఫ్లైఓవర్ బ్రిడ్జితో పాటు మామిడిపల్లి ఆర్‌యుబి త్వరలో పూర్తయ్యేలా చూస్తామన్నారు. హైదరాబాద్‌లో చేపడుతున్న హైడ్రా, మూసీ ప్రక్షాళణ మహా యజ్ఞం లాంటిదని దీనిని ప్రజలు స్వాగ తించాలని భవిష్యత్తు అవసరాల కోసమే ఈ కార్య క్రమాలను ప్రభుత్వం చేపడుతుందని, మూసీ ప్రక్షాళణతో ఢిల్లీకి 30 వేల కోట్లు ముడుపులు అందుతున్నాయని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై మాట్లాడారు. మూసీ సుందరీకరణకు సంబంధించి ఇంకా డీపీఆర్‌యే సిద్ధం కాలేదని, అలాంటప్పుడు ముడుపులు ఎలా ముడుతాయో కేటీఆర్ సమాధానం చెప్పాలన్నారు. నోటికి ఏది వస్తే అది మాట్లాడే ఉద్దేశం తనకు లేదని కేటీఆర్ ఇంగ్లీష్ బాగా మాట్లాడు తాడే తప్ప పరిజ్ఞానం లేదని ఎద్దేవాచేశారు. కేటీఆర్ అమెరికాలో సర్టిఫికెట్ కొనుక్కొని చదువుకున్నాడనే అనుమానాలు కలుగుతున్నాయని అన్నారు. గతంలో హైదరాబాద్‌లో కుండపోత వర్షం పడితే 25శాతం మంది చనిపోయిన ఘటనలు ఉన్నాయని, ఇప్పటికీ పెద్ద వర్షం పడితే ఇళ్లలోకి నీరు వస్తోందని, బీఆర్‌ఎస్ హయాంలో హైదరాబాద్ చుట్టూ ఉన్న చెరువులు, కుంటలను ఆ పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు చేసిన కబ్జాల వల్లే ఈ పరిస్థితి ఏర్పడింద న్నారు. హైడ్రా కొనసాగుతోందని, లేకుండా వయనాడులో వచ్చిన పరిస్థితే హైదరాబాద్‌లో వచ్చే అవకాశం ఉందన్నారు. భవిష్యత్తు బాగుండాలంటే హైడ్రా, మూసీ ప్రక్షాళణ చేయాల్సిందేనన్నారు. మూసీ సుందరీకరణలో భాగంగా ఎక్కడ కూడా పేదలకు ఇబ్బందికి గురిచేయడం లేదని వారికి వేరొక చోట ఆశ్రయం కల్పిస్తున్నామని అన్నారు. జిల్లాలో కూడా హైడ్రా లాంటిది రావాలని నిజామాబాద్‌కు కూడా వస్తుందని ప్రభుత్వ భూములు ఎవరు కబ్జా చేసిన విడిచిపెట్టే ప్రసక్తే లేదన్నారు. తన కుటుంబ సభ్యులు కబ్జా చేసినా తొలగించాల్సిందేనని అప్పుడే భవిష్యత్తు తరాలు బాగుంటాయని అన్నారు. రుణమాఫీ విషయంలోనూ హరీష్ రావు ఇప్పటికీ ఇచ్చిన మాటకు కట్టుబ డి రాజీనామా చేయాలని అలా కాకుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తానన్న హరీష్‌రావు మాట తప్పాడని ఇప్పటికైనా పదేళ్లలో బిఆర్‌ఎస్ పార్టీ రుణమాఫీకి ఇచ్చిన సొమ్మెంత, గత తొమ్మిది నెలల కాలంలో కాంగ్రెస్ పార్టీ రుణమా ఫీకి ఇచ్చిన సొమ్మెంతో చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం హైదరాబాద్‌లో ఇళ్ల స్థలాలు ఇచ్చామని, నిజామాబాద్ నగరంలో కూడా ఇళ్ల స్థలాలు ఇచ్చేలా కృషి చేస్తానన్నారు. ఎంఐఎంతో ఎలాంటి పొత్తు లేదని ఎన్నికల సమయంలో అవసరాన్ని బట్టి పొత్తు గురించి ఆలోచిస్తామన్నారు. చిట్‌చాట్‌లో జిల్లాకాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, నగర అధ్యక్షుడు కేశవేణు తదితరులున్నారు.



గౌరమ్మ గౌరమ్మ ఉయ్యాలో..

- నగరంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు
- కళాశాలల్లో బతుకమ్మ వేడుకలు
- కోర్టు ఆవరణలో బతుకమ్మ ఆడిన జిల్లా న్యాయాధికారులు, న్యాయవాదులు

నిజామాబాద్ అర్బన్/నిజామాబాద్ కల్చరల్, నిజామాబాద్ లీగల్, అక్టోబరు5: బతుకమ్మ పండుగను పురస్కరించుకొని శనివారం జిల్లా కేంద్రంలోని పలు కళాశాలల్లో, పలు సంస్థల్లో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాలతోపాటు కేర్ డిగ్రీ కళాశాలల్లో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినిలు సాంప్రదాయ దుస్తులలో ముస్తాబై బతుకమ్మలను పేర్చి బతుకమ్మలు ఆడుతూ సందడి చేశారు. బతుకమ్మతల్లి అందరిని చల్లగా చూడాలని ఎస్ఎ స్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ మారయ్యగౌడ్ అన్నారు. కేర్ కళాశాలలో జరిగిన వేడుకల్లో విద్యావేత్త నరాల స్వప్న, నరాల సుధాకర్, విద్యార్థినిలు, అధ్యాపకులు పాల్గొన్నారు. నగరంలోని స్నేహసొసైటీలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో స్నేహసొసైటీ కా ర్యదర్శి సిద్దయ్య, ప్రిన్సిపాల్ జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వ రి, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కోర్టులో బతుకమ్మ సంబరాలు

జిల్లాకోర్టు ప్రాంగణంలో శనివారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయాధికారి సునీత కుంచాల, మహిళా న్యాయవాదులు బతుకమ్మలను పేర్చి బతుకమ్మలు ఆడుతూ సందడి చేశారు. అలాగే జిల్లాకేంద్రంలోని నీలకంఠేశ్వర ఆలయం, సుభాష్‌నగర్ రామాలయం, జెండాబాలాజీ మందిర్, ఆర్యనగర్ వెంకటేశ్వర స్వామి ఆలయం, పెద్ద రాంమందిర్, బొడ్డెమ్మ చెరువువద్ద గల గణపతి ఆలయం, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో బతుకమ్మ వేడుకలు ఘనంగా సాగాయి.



ఎస్ఎస్ఆర్‌లో...







కోర్టు ఆవరణలో బతుకమ్మ వేడుకలో జిల్లా న్యాయాధికారి



ఘనంగా వెంకట స్వామి జయంతి వేడుకలు


రుద్రూరు సమీకృత మండల కార్యాలయంలో వెంకటస్వామి జయంతి


కమ్మర్‌పల్లిలో వెంకటస్వామి చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న ఎంపీడీవో

నవీపేట, అక్టోబరు 5: కేంద్ర మాజీ మంత్రి జీ. వెంకట స్వామి జయంతి వేడుకలను శనివారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు.మండల రెవెన్యూ కార్యాలయంలో వెంకట స్వామి చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను పలువురు కొనియాడారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకట రమణ, నాయబ్ తహసీల్దార్ తెలంగ్ రావు, ఆర్ఐ నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి తరానికి ఆదర్శం.. వెంకటస్వామి

రుద్రూరు: కేంద్ర మంత్రి గానే కాకుండా పేదలకు అండగా నిలిచిన రాజనీతి కలిగిన కేంద్ర మాజీ మంత్రి, స్వర్గీయ వెంకట స్వామి అని ఎంపీడీవో సురేష్‌బాబు పేర్కొన్నారు. శనివారం రుద్రూరు సమీకృత మండల కార్యాలయంలో వెంకటస్వామి (కాకా) జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సురేందర్‌నాయక్ ఆర్ఐ నజీర్, పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: కేంద్రమంత్రి గడ్డం వెంకట స్వామి జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలన్న ఆదేశాల మేరకు శనివారం కమ్మర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఎంపీడీవో రాజా శ్రీనివాస్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ చంద్రశేఖర్, జూనియర్ అసిస్టెంట్‌లు అమృత్, రా ధిక, ఎంపీవో సదాశివ్, ఏపీవో విద్యానంద్ పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం మాజీమంత్రి వెంకటస్వామి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాక వెంకటస్వామి చిత్రపటానికి రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెంకటస్వామి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్నో ఉన్నత పదవులు అధిరోహించారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, కాంగ్రెస్ నాయకులు అయ్యప్ప శ్రీనివాస్, ఆకుల రాము, రింగుల భూషణ్ పాల్గొన్నారు.

ఏర్గట్ల విద్యార్థినికి కరాటేలో బ్లాక్ బెల్ట్

ఏర్గట్ల, అక్టోబరు 5: మండల కేంద్రానికి చెందిన విద్యార్థిని నూనె శ్రీనిధి కరాటేలో బ్లాక్ బెల్ట్ సాధించింది. జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో శుక్రవారం జరిగిన పోటీల్లో బిబిటెక్ ఎగ్జామినేషన్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి మొదటిసారిగా బ్లాక్ బెల్ట్ సాధించినట్లు చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ పసునూరి అవినాష్ తెలిపారు.

డిచ్‌పల్లిలో త్వరలో మెడికల్ కళాశాల

▸▸ సీఎంసీ ఆస్పత్రి సిబ్బంది క్వార్టర్స్ ప్రారంభించిన పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్, రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి


మాట్లాడుతున్న పీసీసీ చీఫ్ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్

డిచ్‌పల్లి, అక్టోబరు 5: డిచ్‌పల్లిలో త్వరలో సీఎంసీ ఆధ్వర్యంలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేసేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని స్థానిక ఎమ్మెల్యే భూపతిరెడ్డితో కలిసి సీఎంను కోరుతానని టీపీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్ అన్నారు. శనివారం డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి జాతీయ రహదారి పక్కన గల సీఎంసీ కళాశాల ప్రాంగణంలో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది కోసం నిర్మించిన క్వార్టర్స్‌ను స్థానిక ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిచ్‌పల్లి సీఎంసీ ఆస్పత్రికి పూర్వ వైభవం తీసుకొస్తానని అంతేగాకుండా వైద్య కళాశాల ఏర్పాటుకు ముఖ్యమంత్రికి విన్నవించి 2025లోగా ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. డిచ్‌పల్లి అంటే తనకు ప్రత్యేకమైన అనుబంధం ఉందని, తాను 1994 లోనే 27ఏళ్ల వయస్సులోనే ఎమ్మెల్యేగా ఇక్కడ పోటీ చేశానని గుర్తు చేశారు. వైద్య కళాశాల అనుమతుల కోసం ఎంసీఐ అధికారులతో మాట్లాడి అనుమతులు వచ్చేందుకు సహకరిస్తానని పేర్కొన్నారు. రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి మాట్లాడుతూ సీఎంసీ ఆవరణలో వైద్య కళాశాల, నర్సింగ్ కళాశాల, ఆస్పత్రి ఏర్పాటుకు శుభ పరిణామన్నారు. దీంతో డిచ్‌పల్లి మరింత అభివృద్ధి చెందుతుందని, ఇక్కడి పేదలకు వైద్య సేవలు అందుతాయని పేర్కొన్నారు. సీఎస్ఐ ట్రెజరర్ డా.విమల్ సుకుమార్ మాట్లాడుతూ విక్టోరియా ఆస్పత్రిలో వైద్య కళాశాల ఏర్పాటు ఈ ప్రాంత వాసుల్లో నూతన ఆశలు చిగురించనున్నాయని, ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిషప్, రుబిన్ మార్క్, వైస్‌చైర్మన్ విన్‌స్టన్ సెక్రటరి ప్రభుకిరణ్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, నగర కాంగ్రెస్ అధ్య క్షుడు కేశ వేణు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అమృతా పూర్ గంగాధర్, కాం గ్రెస్ ప్రతినిధులు నరాల రత్నాకర్, మెట్టు శ్యాంసన్, వాసుబాబు, ధర్మాగౌడ్, సాయిరెడ్డి, దేవకరుణ, పాల్గొన్నారు.

త్వరలో ఆస్పత్రిలో పూర్తిస్థాయి వైద్య బృందం

● వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్

ఆర్మూర్‌టౌన్, అక్టోబరు 5: ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల కొరతను తీర్చి త్వరలో పూర్తిస్థాయిలో వైద్యులు అందుబాటులో ఉంటారని వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ అన్నారు. శనివారం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తనిఖీ నిర్వహించి రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అత్యవసర సేవలను అందించాలని డాక్టర్‌లకు సూచించారు. ఆస్పత్రిలో ఉన్న సౌకర్యాలు, అసౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వైద్యపరీక్షలు చేసుకొని విశ్రాంతి తీసుకోవాలని రోగులకు సూచించారు. నిరుపయోగంగా ఉన్న స్కానర్‌ను అందుబాటులో తీసుకువచ్చే విధంగా చూస్తామని ఆయన తెలిపారు. అనంతరం అజయ్‌కుమార్‌ను వైద్య సిబ్బంది శాలువ, పూలబొకేతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్, ఆసుపత్రి సూపరింటెండెంట్ రవికుమార్, డాక్టర్ అమృత్‌రాంరెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

బోధన్ గ్రామాభివృద్ధి కమిటీకి 27 నామినేషన్లు

● 9న గ్రామాభివృద్ధి కమిటీ ఎన్నికలు

బోధన్‌రూరల్, అక్టోబరు 5: బోధన్ పట్టణ గ్రామాభివృద్ధి కమిటీ మహాలక్ష్మి ట్రస్టు ఎన్నికలకు శనివారం నామినేషన్ల ప్రక్రియ పూర్తయిందని ఎన్నికల అధికారులు ఎంబెల్లి శంకర్, లోల శంకర్, పోశెట్టి, అజయ్, సాయిలు తెలిపారు. అధ్యక్ష పదవి కోసం ముగ్గురు నామినేషన్‌లు దాఖలు చేశారన్నారు. ప్రధాన కార్యదర్శి పదవికి ఆరు నామినేషన్ పత్రాలు దాఖలయ్యాయన్నారు. కోశాధికారి పదవికి 7 నామినేషన్‌లు, ఉపాధ్యక్ష పదవికి ఐదు నామినేషన్‌లు, సంయుక్త కార్యదర్శి పదవికి 6నామినేషన్‌లు దాఖలయ్యాయని వారు తెలిపారు. ఈ నెల 9వ తేదిన మహాలక్ష్మి, గ్రామాభివృద్ధి కమిటీ ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

విజయ్ రూరల్ ఇంజనీరింగ్ కళాశాలలో బతుకమ్మ సంబరాలు

మాక్లూర్, అక్టోబరు 5: మండలంలోని దాస్‌నగర్ గ్రామ శివారులో గల విజయ్ రూరల్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం బతుకమ్మ సంబరాలు విద్యార్థినులు ఘనంగా జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతిని చాటిచెప్పే బతుకమ్మ పండగను కళాశాల విద్యార్థినులు, అధ్యాపకులు, సిబ్బంది కలిసి రంగురంగులతో అలంకరించిన బతుకమ్మలను సాంప్రదాయ బతుకమ్మ పాటలపై నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గణేష్‌తో పాటు అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దుర్గాదేవి వేడుకలు

జక్రాన్‌పల్లి అక్టోబరు 5: మండలంలోని అన్ని గ్రామాల్లో దుర్గాదేవి ఉత్సవాలను భక్తులు, ప్రజలు, మండపాల నిర్వాహకులు దుర్గాదేవి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. శనివారం జక్రాన్‌పల్లి, అర్గుల్ గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో దుర్గాదేవి మండపాల్లో భక్తులు అన్నదానంలో పాల్గొన్నారు.

కోనాపూర్‌లో రాజరాజేశ్వరి దేవి అవతారంలో..

కమ్మర్‌పల్లి: మండలంలోని మారుమూలన ఉన్న కోనాపూర్ గ్రామంలో జై దుర్గా భవాని ఉ త్సవ కమిటీ ఆధ్వర్యంలో కొలువుదీరిన దుర్గా మాత శనివారం శ్రీరాజరాజేశ్వరి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. జై భవాని దుర్గామాతా ఉత్సవ కమిటీ సభ్యులు పి.చిన్నిరెడ్డి, బి.పరమేష్, టీ సంజీవ్, బి.రమేష్, సీహెచ్ లక్ష్మీనారాయణ పూజల్లో పాల్గొన్నారు

అమ్మవారిని పూజిస్తే సకల శుభాలు

బోధన్ రూరల్: ప్రజలు అమ్మవారిని పూజిస్తే సకల శుభాలు కలుగుతాయని, దుర్గాదేవి నవరాత్రుల్లో అమ్మవారిని నిత్యం కొలిస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని వేద పండితులు ఉదయ్ మహరాజ్ అన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని తట్టికోటలో అమ్మవారి మండపంలో మహిళలచే ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు

భీమ్‌గల్: పట్టణ కేంద్రంలోని అయ్యప్ప నగర్‌లో ప్రతిష్ఠించిన దుర్గాదేవి వద్ద మూడో రోజు కాలనీవాసులు ఆధ్వర్యంలో దేవికి నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

నూతన చట్టాలపై పోలీసులకు అవగాహన

ఆర్మూర్‌టౌన్, అక్టోబరు 5: పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం నూతన చట్టాలపై పోలీసులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.రామకృష్ణ మాట్లాడుతూ భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం 2023పై పోలీస్ అధికారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఖాందేశ్ శ్రీనివాస్, రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, భీమ్‌గల్ సీఐ నవీన్‌కుమార్, ఎస్సైలు రాము, అనిల్, నరేష్, గంగాధర్, యాదగిరి పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: బోధన్ కోర్టులో శనివారం భారత న్యాయ సంహిత చట్టం, భారతీయ నాగరిక సురక్ష సంహిత చట్టాలపై పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిద్రపు రాణి చట్టాలపై అవగాహన కల్పించారు. శనివారం కోర్టు ప్రాంగణంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర డైరెక్టర్ ప్రాసిక్యూషన్ వైజయంతి, డిప్యూటీ డైరెక్టర్ ప్రాసిక్యూషన్ లక్ష్మినర్సయ్య ఆదేశాల మేరకు బోధన్ కోర్టు ప్రాంగణంలో శిక్షణ తరగతులు, చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు. ప్రతీఒక్కరు చట్టాలపై అవగాహన కలిగిఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది శ్యామ్‌రావు, బోధన్ ఏసీపీ శ్రీనివాస్, సీఐలు వెంకట్ నారాయణ, విజయ్ బాబు, జయేష్ రెడ్డి, ఎస్సైలు, ఫారెస్ట్ అధికారులు, ఎక్సైజ్ అధికారులు, కోర్టు కానిస్టేబుళు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరమార్శించిన బాల్కొండ బీజేపీ ఇన్‌చార్జి మల్లికార్జున్ రెడ్డి

కమ్మర్‌పల్లి, అక్టోబరు 5: శుక్రవారం హార్వెస్టర్ ఢీకొని మరణించిన కమ్మర్‌పల్లి బీజేపీ నాయకుడు చింత గణేష్ కుటుంబాన్ని శనివారం భారతీయ జనతా పార్టీ బాల్కొండ నియోజకవర్గం ఇన్‌చార్జి డాక్టర్ ఏలేటి మల్లికార్జున్ రెడ్డి పరమార్శించారు. కుటుంబ సభ్యుల ద్వారా ప్రమాదవివరాలను అడిగి తెలుసుకుని ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట బీజేపీ నాయకులు చింత ప్రవీణ్, మల్లేష్ యాదవ్, వీడీసీ అధ్యక్షుడు బోగ రామస్వామి, అన్నం గణపతిరాం, తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ముప్కాల్, అక్టోబరు 5: బాల్కొండ మండలంలోని బోదేపల్లి గ్రామానికి చెందిన గేదెల కాపరి తెట్టం మల్లయ్య ప్రమాదవశాత్తు గ్రామ చెరువులో పడి మృతి చెందగా విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ నిరుపేద కుటుంబం కావడంతో ఆ కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సహాయాన్ని తన అనుచరుల ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై డీఎల్‌పీవో సమీక్ష

జక్రాన్‌పల్లి అక్టోబరు 5: మండల పరిషత్ కార్యాలయంలో అభివృద్ధి పనులపై డీఎల్‌పీవో సమీక్ష సమావేశం నిర్వహించారు. శనివారం ఎంపీడీవో సతీష్‌కుమార్ అధ్యక్షతన సమీక్ష సమావేశాన్ని నిర్వహించగా వివిధ పథకాల కింద చేపట్టే అభివృద్ధి పనులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ, ఇతర పథకాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఎంపీవో యూసుఫ్‌ఖాన్ పాల్గొన్నారు.

బీజేపీ రూరల్ కన్వీనర్‌గా సిర్ప సుదర్శన్

బోధన్‌రూరల్, అక్టోబరు 5: ఎమ్మెల్సీ పట్ట భద్రుల ఎన్నికకు బీజేపీ బోధన్ మండల రూరల్ కన్వీనర్‌గా సిర్ప సుదర్శన్‌ను నియమించినట్లు ఆయన తెలిపారు. ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో బీజేపీ పార్టీ అత్యధిక మెజారిటీ సాధించే దిశగా తనవంతు కృషి చేస్తానన్నారు. తనను కన్వీనర్‌గా నియమించిన ఎంపీ ధర్మపురి అరవింద్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా వెంకటేశ్వరస్వామి ఉత్సవాలు

జక్రాన్‌పల్లి అక్టోబరు5: మండలంలోని తొర్లికొండ గ్రామంలో శ్రీ వెంకటేశ్వరస్వామి ఉత్సవాలను భక్తులు, గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తెల్లవారు జాము నుంచే భక్తులు అధికసంఖ్యలో కొండపైకి చేరుకున్నారు. అనంతరం స్వామివారి పల్లకిని భక్తులు కొండపై చుట్టు ప్రదక్షిణ చేయించారు. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద భక్తుల కోసం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీ సభ్యులు, భక్తులు గ్రామస్థులు పాల్గొన్నారు.

దేవాంగ సంఘ కార్యవర్గ ప్రమాణ స్వీకారం


ప్రమాణస్వీకారం చేస్తున్న దేవాంగ సంఘ కార్యవర్గ సభ్యులు

ఆర్మూర్ రూరల్, అక్టోబరు 5: ఆర్మూర్ పట్టణంలోని దేవాంగ సంఘంలో నూతన కార్యవర్గ సభ్యులు శనివారం ప్రమాణస్వీకారం చేశారు. అధ్యక్షులుగా కొంగి రాము, ఇతర కార్యవర్గసభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ వినయ్‌కుమార్‌రెడ్డి హాజరై నూతన కార్యవర్గ సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య శ్రీనివాస్, కౌన్సిలర్ ప్రసాద్, పండిత్ పవన్, మాజీ సర్పంచ్ కొంగి సదాశివ్, సత్యనారాయణ, మనోహర్, గూపాల వినయ్, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ కోసం ఎమ్మెల్యేకు వినతి

డిచ్‌పల్లి, అక్టోబరు 5: డిచ్‌పల్లి మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ నుంచి క్రిస్టియన్ మెడికల్ కళాశాల వరకు రోడ్డుపై సెంట్రల్ లైటింగ్ ను ఏర్పాటు చేసేల చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డికి స్థానికులు శనివారం వినతిపత్రం అందజేశారు. రాత్రి సమయాల్లో లైటింగ్ లేని కారణంగా తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, మద్యం దారులు రోడ్లపై చిందులు వేస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారని, మహిళలు ఈ రోడ్డు గుండా రాత్రి సమయాల్లో వెళ్లాలంటే భయాందోళనకు గురి అవుతున్నారని ఎమ్మెల్యేకు స్థానికులు తెలిపారు. సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుతో స్టేషన్ నుంచి సుద్దపల్లి వరకు రాత్రి వేళల్లో నడుచుకుంటూ వెళ్లే వారికి ఎంతో ఉపయోగకరమని జాతీయ రహదారిపై ప్రమాదాలు తగ్గుతాయని తెలిపారు.

క్రైం సమాచారం

జాన్కంపేట్‌లో తాళం వేసిన ఇంట్లో చోరీ

వేల్పూర్, అక్టోబరు 5: వేలూర్ మండలం జాన్కంపేట్ గ్రామంలో తాళం వేసి ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం జాన్కంపేట్ గ్రామానికి చెందిన జంగం దశరథ్ వారి కుటుంబ సభ్యులతో ఇంటికి తాళం వేసి శుక్రవారం బంధువు ఇంటి శుభకార్యానికి వెళ్లారు. అర్ధరాత్రి దొంగలు ఇంటి తాళాన్ని పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. బీరువాలో ఉన్న ఆరు తులాల వెండి పట్ట గొలుసులు, రూ.10వేల నగదు ను దొంగలు ఎత్తుకెళ్లినట్టు బాధితులు తెలిపారు.

ఆర్మూర్‌లో పాన్‌షాప్ దగ్ధం

ఆర్మూర్ టౌన్, అక్టోబరు 5: పట్టణంలోని కొత్తబస్టాండ్ ఎదురుగా శుక్రవారం రాత్రి ఓ పాన్‌షాప్ దుకాణం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది వచ్చి పాన్‌షాప్ మంటలను ఆర్పివేశారు. దీంతో సుమారు రూ.లక్షా 50వేల వరకు ఆస్తి నష్టం జరిగినట్టు దుకాణ యజమాని సతీష్ తెలిపారు.

వాహనాలు తనిఖీ

డిచ్‌పల్లి, అక్టోబరు 5: 44వ జాతీయ రహదారి సాంపల్లి శివారులో శనివారం సాయంత్రం అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ వాహనాలు తనిఖీలు చేశారు. వాహనాలన తనిఖీ చేసి సరైన పత్రాలు లేని వాటికి జరిమానలు విధించారు.



క్రీడా జ్యోతితో మహేష్‌కుమార్‌గౌడ్

జిల్లాకు చేరుకున్న సీఎం కప్ క్రీడా జ్యోతి

సుభాష్‌నగర్, అక్టోబరు5: సీఎం కప్ క్రీడాజ్యోతి శనివారం సాయంత్రం జిల్లా కేంద్రానికి చేరుకుంది. జిల్లా కేంద్రంలోని పూలాంగ్ చౌరస్తా వద్ద మహేష్‌కుమార్‌గౌడ్ క్రీడా జ్యోతికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చేపట్టిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. క్రీడాకారులు ఇటీవల శిక్షణ పూర్తి చేసుకున్న పోలీస్ సిబ్బంది, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ క్రీడాకారుడు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయి వరకు క్రీడలను విస్తరింపజేసి క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు వారిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా సీఎం కప్ పోటీలను గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో వివిధ విభాగాల్లో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలో సత్తా చాటేలా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ సంకల్పం అని స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే సీఎం కప్ పోటీల గురించి క్రీడాకారులకు తెలిసేలా విస్తృత ప్రచారం కోసం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలు, పట్టణాలు, నగరాల మీదుగా ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి ముత్తెన్న, నిజామాబాద్ ఏసిపి రాజావెంకట్‌రెడ్డి, రాష్ట్ర సమన్వయకర్త కె.మధు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

● మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసిన ఎక్సైజ్ ఉద్యోగులు

టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను ఎక్సైజ్ హెడ్‌కానిస్టేబుళ్ల సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌజ్‌లో కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ హెడ్‌కానిస్టేబుళ్ల సంఘం అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ గత ఏడేళ్లుగా ఎక్సైజ్ శాఖలో బదిలీలు లేవని బదిలీలు చేపట్టాలని మహేష్‌కుమార్‌గౌడ్‌ను కోరారు. 200మంది కానిస్టేబుళ్లు హెడ్‌కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందే అప్‌గ్రేడేషన్‌పై ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉందని వీటిని పరిష్కరించాలని కోరారు. మహేష్‌కుమార్‌గౌడ్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ చంద్రమోహన్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ భోజన్న, ఉత్తమ్, నరేష్, స్రవంతి, సంతోష్, సుదర్శన్, ప్రభాకర్, సంగయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే, సీఐ, ఎస్సైలపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి'

నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 5: కబ్జాదారులకు కొమ్ము కాస్తున్న ఆర్మూర్ ఎమ్మెల్యే, డిచ్‌పల్లి సీఐ, జక్రాన్‌పల్లి ఎస్సైలపై అట్రాసిటీ కేసునమోదు చేయాలని బాధితులు డిమాండ్ చేశారు. జక్రాన్‌పల్లి మండలం మునిపల్లి గ్రామంలో దళితుల భూములను దౌర్జన్యంగా కబ్జా చేస్తున్న వారికి ఎమ్మెల్యే, పోలీసులు అండగా నిలిచారని విమర్శించారు. ఈ మేరకు జిల్లాకేంద్రంలోని పాత కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కబ్జాలు చేస్తూ దౌర్జన్యానికి పాల్పడుతున్న 12మందిపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన దళితులు డిమాండ్‌చేశారు. బాధితుడు రావట్ల నర్సన్న మాట్లాడుతూ మాదిగ కులానికి చెందిన తనకు ఎకరం భూమి ఉందని, కానీ ఆ భూమిని గ్రామానికి చెందిన కొందరు కబ్జా చేస్తూ అందులో శివలింగం ప్రతిష్ఠాపన చేశారని అన్నారు. అదేమిటని అడిగిన తమపై దుర్భాషలాడుతూ దౌర్జన్యానికి పాల్పడుతున్నారని అన్నారు. ఈవిషయమై జక్రాన్‌పల్లి మండల పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వోకు ఫిర్యాదు చేయగా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఫిర్యాదుపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పోలీసులపై పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. సమావేశంలో జెల్ల మజ్జు, గుమ్మెర్ల గంగారాం, గెమ్మెర్ల నర్సయ్య, సాగర్, గోపి, భూమేష్, రాహుల్, అభి, గైని రమేష్, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలో చాంపియన్‌గా జిల్లా క్రీడాకారులు


సుభాష్‌నగర్, అక్టోబరు 5: రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన రెజ్లింగ్ క్రీడా పోటీల్లో జిల్లా క్రీడాకారులు ఓవరాల్ చాంపియన్‌గా నిలిచారు. అండర్-17 విభాగంలో బంగారు పతకాలు సాధించారు. నేహా బేగం 43 కేజీల విభాగంలో, ఎం.సింధూ 73, మిగతా విభాగాల్లో సిల్వర్, బ్రాంజ్ మెడల్స్‌ను సాధించారు. వివిధ విభాగాల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ నాగమణి అభినందించారు. ఈ పతకాలు రావడానికి కృషిచేసిన రుద్రూర్ పిడి సంతోష్, మంచిప్ప పీడీ దేవేందర్‌లను సెక్రెటరీ అభినందించారు.



గెలిచిన పతకాలతో క్రీడా కారులు

విద్యుత్ శాఖ వినూత్న ప్రయోగం

● సరఫరాకు అంతరాయం లేకుండా విద్యుత్ పనులు



విద్యుత్ పనులు చేస్తున్న దృశ్యం

సుభాష్‌నగర్, అక్టోబరు5: విద్యుత్‌శాఖ వినూత్న ప్రయోగాలకు శ్రీకారం చుట్టింది. గతంలో సబ్‌స్టేషన్లలో మరమ్మతులు చేయాలంటే విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగేది. సబ్‌స్టేషన్ మరమ్మతులు చేస్తున్నంత సేపు ఆ సబ్ స్టేషన్ పరిధిలోని కాలనీలన్నీ విద్యుత్ సరఫరా నిలిపివేసేవారు. నూతన సీఎండీ ఆలోచన ఆదేశాల మేరకు విద్యుత్ శాఖ వినూత్న ప్రయోగానికి నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్ సబ్‌స్టేషన్ నాంది పలికింది. సుభాష్‌నగర్ సబ్‌స్టేషన్ పైలెట్ ప్రాజెక్టుగా శనివారం ఎలాంటి విద్యుత్ సరఫరా నిలిపివేయకుండా సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు నిర్వహించారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు సుభాష్‌నగర్ ఉపకేంద్రం పరిధిలో విద్యుత్ సరఫరా అవుతుండగానే మరమ్మతులు అధికారులు చేపట్టారు. సబ్‌స్టేషన్‌లో అంతరాయం కాకుండా ఏబీ స్విచ్‌లు 11 కేవీకి అటాచ్‌చేసే పనులు కొనసాగించారు. దీంతో విద్యుత్ సరఫరా నిలిపివేయకుండానే ఈ పనులను జిల్లా నోడల్ అధికారి సీఈ అశోక్, ఎస్‌ఈ రవీందర్, డీఈలు శ్రీనివాస్ పర్యవేక్షించారు. విద్యుత్ నిలిపివేయకుండా సబ్‌స్టేషన్ మరమ్మతులు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ పద్ధతినే అన్ని సబ్ స్టేషన్‌లలో పాటించి విద్యుత్ సరఫరాకు అంతరాయం అనే పదాన్ని తీసివేస్తామని అధికారులు అన్నారు. కార్యక్రమంలో ఏడీఈ తోటరాజశేఖర్, ఏఈ గంగాశేఖర్, ఫోర్‌మెన్ రామారావు, ఇన్‌స్పెక్టర్ రామ్, లైన్‌మెన్‌లు సంజీవ్, రమేష్, దశరథ్, ప్రేమ్‌లాల్, ఏఎల్ఎంలు కృష్ణయ్య, పరమేశ్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్, ఇతర శాఖల అధికారులు

కలెక్టరేట్‌లో ఘనంగా వెంకటస్వామి జయంతి వేడుకలు

నిజామాబాద్ అర్బన్, అక్టోబరు5: కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వఆదేశాల మేరకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో జ్యోతి ప్రజ్వలన చేసి అధికారికంగా జయంతి ఉత్సవాలను నిర్వహించారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, ట్రైనీ కలెక్టర్ సంకేత్‌కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతోపాటు ఇతర అధికారులు వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుదీర్ఘకాలం పాటు కేంద్ర మంత్రిగా పార్లమెంట్ సభ్యునిగా వెంకటస్వామి దళితబడుగు బలహీనవర్గాల కోసం విశేషంగా కృషిచేశారని ఈసందర్భంగా వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో ఆర్మూర్ ఆర్‌డీవో రాజాగౌడ్, జిల్లా యువజన క్రీడల అధికారి ముత్తెన్న, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, పర్యవేక్షకుడు పవన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

ఇందల్వాయి, అక్టోబరు5: తమతో కలిసి చదువుకొని అనారోగ్యంతో మృతిచెందిన స్నేహితుడి కుటుంబానికి తోటి స్నేహితులు ఆర్థిక సహాయం అందజేశారు. గన్నారం గ్రామానికి చెందిన తాళ్ల దేవేందర్‌గౌడ్ ఇటీవల కిడ్నీ సంబంధిత వ్యాధితో మృతిచెందడంతో తన తోపాటు చదువుకున్న 1992-93 పదవ తరగతి బ్యాచ్ స్నేహితులు 31వేల 500 రూపాయల ఆర్థిక సహాయాన్ని దేవేందర్ కుటుంబానికి అందజేశారు.

ముగిసిన డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను పరిశీలిస్తున్న ఎస్‌ఈసీఆర్‌టీ డైరెక్టర్ రమేష్

నిజామాబాద్‌అర్బన్, అక్టోబరు5: డీఎస్సీ-2024 ఫలితాలలో 1/3 చొప్పున ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయ్యింది. జిల్లా కేంద్రంలోని నిర్మల హృదయ పాఠశాలలో ఈ నెల 2వ తేదీ నుంచి సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహిస్తున్నారు. శనివారం చివరిరోజు సర్టిఫికెట్ల పరిశీలన చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.వి.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో అర్హులైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించారు. మొత్తం 1321 మంది అభ్యర్థులకు గాను 1250 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించినట్లు డీఈవో తెలిపారు. చివరిరోజు సర్టిఫికెట్ల పరిశీలనను ఎస్‌ఈసిఆర్‌టి డైరెక్టర్ రమేష్ పరిశీలించారు. సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతున్న తీరును ఆయన పరిశీలించి తగు సూచనలు చేశారు.

● మధ్యాహ్న భోజనం బిల్లుల విడుదల

రాష్ట్ర ప్రభుత్వం 2024-25 సంవత్సరానికి గాను మధ్యాహ్న భోజన పెండింగ్ బిల్లులను విడుదల చేసినట్లు డీఈవో దుర్గాప్రసాద్ తెలిపారు. 9, 10 తరగతుల కుక్కింగ్ కాస్ట్‌కు గాను 2కోట్ల 21లక్షల 17వేల 866 రూపాయల బడ్జెట్‌ను విడుదల చేశారని మండలాల వారిగా అవసరమైన నిధులను రిలీజ్ చేయడం జరిగిందని మండల విద్యాశాఖ అధికారులు నిధులను మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు విడుదల చేయాలని ఆయన ఆదేశించారు.

'మాదిగలను మోసం చేసిన సీఎంతో తాడోపేడో తేల్చుకుంటాం'

వేల్పూర్, అక్టోబరు 5: మాదిగలకు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట తప్పి మాదిగలను మోసం చేశాడని, ఆయనతో తాడోపేడో తెల్చుకుంటామని ఎమ్మార్పీఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు కనక ప్రమోద్ మాదిగ అన్నారు. వేల్పూర్ మండల కేంద్రంలో శనివారం ఎంఎస్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద ప్రభాకర్ మాదిగ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కనక ప్రమోద్ మాదిగ మాట్లాడుతూ ఆగస్టు 1న సుప్రీం కోర్టు ఇచ్చిన ఎస్సీవర్గీకరణ తీర్పుకు సీఎం రేవంత్‌రెడ్డి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఎస్సీ వర్గీకరణ చేసే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని సుప్రీం కోర్టు స్పష్టం చెప్పిందన్నారు. తీర్పు వెలువడిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి అందరి కన్న ముందే తీర్పును స్వాగతించామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలను మోసం చేసి డీఎస్సీ ఫలితాలను విడుదల చేశారన్నారు. ఈనెల 9న జిల్లా కేంద్రంలో మాదిగల నల్లజెండా భారీ ప్రదర్శన నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి మంద ప్రభాకర్, నాగం రాజేష్, బాలకిషన్ పాల్గొన్నారు.

టీజీవో నూతన కార్యవర్గం ఎన్నిక

● అధ్యక్ష, కార్యదర్శులుగా అలుక కిషన్, సంగం అమృత్‌కుమార్

సుభాష్‌నగర్, అక్టోబరు 5: తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా అలుక కిషన్, సంగం అమృత్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవోస్ భవనంలో శనివారం టీజీవో సర్వసభ్య సమావేశం నిర్వహించి అనంతరం ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరు శ్రీనివాస్ హాజరై నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు కార్యవర్గానికి నియామక పత్రాలను అందజేశారు. అంతకుముందు ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. ఎన్నికల అధికారి శ్రీనివాస్ ఎన్నికల ప్రక్రియను ప్రారంభించారు. ఉదయం 10గంటల నుంచి 11గంటల వరకు నామినేషన్ల స్వీకరణ, 11 గంటల నుంచి 12గంటల వరకు స్క్రూటినీ, 12 గంటల నుంచి 1గంట వరకు విత్‌డ్రాలు నిర్వహించారు. అన్ని పోస్టులకు ఒకేఒక్క నామినేషన్ రావడంతో నామినేషన్ వేసిన అభ్యర్థులను విజేతగా ప్రకటించారు. అధ్యక్ష, కార్యదర్శులతో పాటు మిగతా పోస్టులకు సైతం ఒకే నామినేషన్ రావడంతో అలుక కిషన్ ఎన్నిక ఏకగ్రీవమైంది. ఎన్నిక అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరు శ్రీనివాస్ అధ్యక్ష, కార్యదర్శులతో పాటు కార్యవర్గానికి ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఇప్పుడిప్పుడే ఉద్యోగ సంఘాలకు గుర్తింపు ఏర్పడిందని, ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్స్‌ల కోసం పోరాడాలని అన్నారు. నిజామాబాద్ జిల్లాలో సంఘానికి భవనాన్ని ఏర్పాటు చేసేలా నూతన కార్యవర్గం కృషి చేయాలన్నారు. అనంతరం టీజీవో నూతన అధ్యక్షుడు అలుక కిషన్ మాట్లాడుతూ టీఎన్‌జీవో అధ్యక్షుడిగా జేఏసీ చైర్మన్‌గా ఎనిమిదేళ్లకు పైగా ఉన్నానని ఉద్యోగుల సాధక బాధకలు తెలుసన్నారు. జిల్లాలో అందరిని కలుపుకొనిపోయి కార్యక్రమాలు నిర్వహించానన్నారు. అలాగే టీజీవో అధ్యక్షుడిగా కూడా టీజీవో సంఘాన్ని అభివృద్ధి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్రనాయకులు ఉన్నారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

నూతన కార్యవర్గం

అధ్యక్షులు అలుక కిషన్, ప్రధాన కార్యదర్శి సంగం అమృత్‌కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్ జలగం తిరుపతిరావు, ఉపాధ్యక్షులు హన్మంత్‌రెడ్డి, ఎన్.రాములు, జయంతికుమారి, జాయింట్ సెక్రెటరీలు బి.వి.నాగమోహన్, ప్రవీణ్‌కుమార్, లావణ్య, ట్రెజరర్ దేవిసింగ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ జి.సాయి కృష్ణ, పబ్లిసిటీ సెక్రెటరీ బి.సాయిలు, ఆఫీస్ సెక్రెటరీ మహ్మద్ ఇక్బాల్, కల్చరల్ సెక్రెటరీ డి.వినయ్ కుమార్, స్పోర్ట్స్ గేమ్స్ సెక్రెటరీ డి.గోపీకృష్ణ, ఎగ్జిక్యూటీవ్ మెంబర్‌లు కె.నాగరాజు, సూరిమాడ పావని, చందర్, ఇందూరు గంగాధర్.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో చాంపియన్లుగా మహబూబ్‌నగర్- నిజామాబాద్- హైదరాబాద్ జట్లు

ధన్వాడ, అక్టోబరు5: నారాయణపేట జిల్లా ధన్వాడలో రెండురోజులుగా నిర్వహించిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు శనివారం ముగిశాయి. తెలంగాణలోని 10 ఉమ్మడి జిల్లాల జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. అండర్ 14 విభాగంలో మహబూబ్‌నగర్ జిల్లా జట్టు చాంపియన్‌షిప్ గెలుచుకుంది. నిజామాబాద్ జిల్లా 33 కేజీల విభాగంలో చాంపియన్‌గా నిలిచింది. అండర్ 19 విభాగంలో హైదరాబాద్ జట్టు చాంపియన్‌గా నిలిచింది. ఆయా జిల్లాల జట్లు పోటాపోటీగా తలపడ్డాయి విజేతలైన వారికి ఎస్‌జీఎఫ్ క్రీడా సమాఖ్య కార్యదర్శి నర్సిములు, ఆర్గనైజర్ ఊసు రవికుమార్ విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పోటీలో ఓడిపోయిన వారు నిరుత్సాహ పడకుండా గెలుపు కోసం ప్రయత్నించాలన్నారు. ప్రభుత్వం క్రీడల కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించి క్రీడాకారులను ప్రోత్సహిస్తుందన్నారు. అందుకు విద్యార్థులు చదువుతో పాటు క్రీడాల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎస్ఓలు అశోక్, మహ్మద్ కరీం, జయపాల్, స్టేట్ అబ్జర్వర్ దానయ్య, కోచ్‌లు భాగ్య, శిరీష, మోహన్ సింగ్, దేవేందర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు

● వివిధ రూపాల్లో దర్శనమిస్తున్న అమ్మవారు

నిజామాబాద్ కల్చరల్, అక్టోబరు5: దేవిశరన్నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారికి భక్తులు భక్తిశ్రద్ధలతో పూజిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారుభక్తులకు చంద్రఘంటా రూపంలో శనివారం దర్శనమిచ్చారు. అర్ధచంద్రాకార రూపంలో చంద్రుడిని పార్వతీదేవి తలపై పెట్టుకున్న రూపాన్ని భక్తులు దర్శించుకొని పూజించారు. అమ్మవారికి ప్రీతికరమైన నైవేద్యాలను సమర్పించుకోవడంతో పాటు ఒడి బియ్యం, సారె అందజేశారు. పలు ప్రాంతాల్లో అమ్మవారికి ప్రత్యేక పుష్పార్చన, పూజలతో పాటు వివిధ రకాల గాజుల సమర్పణ పూజలుచేశారు. సాయంత్రం మంటపాలు, ఆలయాల్లో సామూహిక అర్చనలు, దేవి మాత పూజలు వైభవంగా సాగాయి. జిల్లా కేంద్రంలోని ఏడుపాయల దుర్గమ్మ, నీలకంఠేశ్వర ఆలయంలోని పార్వతీదేవి ఆలయం, లలితాదేవి ఆలయం, వాసవీ కన్యకాపరమేశ్వరి తదితర ఆలయాల్లో వైభవంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు కూష్మాంఢ రూపం

దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారు ఆదివారం కూష్మాంఢ రూపంలో దర్శనమివ్వనున్నారు. అమ్మవారు భూమిపై వృక్ష సంపదతో పుడిపడి ఉండటంతో అందుకు సూచికగా నారింజ లేదా ఆకుపచ్చ రంగులో ఉన్న చీరతో ప్రశాంతతో ఉన్నటువంటి అమ్మవారి అలంకరణ ఉండనుంది. అమ్మవారిని ఈరోజు పూజించడం వల్ల వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని పాడి పంటలతో నరదృష్టి లేకుండా ఆయురారోగ్యాలతో ఉంటారని భక్తులు విశ్వసిస్తూ అమ్మను పూజిస్తారు. అమ్మకు ప్రీతికరమైననైవేధ్యాలు సమర్పించుకొని భక్తిని చాటుకుంటారు.

సోయాబీన్ పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి: బీఆర్ఎస్

వేల్పూర్, అక్టోబరు 5: రైతులు పండించిన సోయాబిన్ ప్రతీ గింజను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం వేల్పూర్‌లో బీఆర్ఎస్ కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు శేఖర్‌రెడ్డి, జైడి నాగాధర్‌రెడ్డి, ఏలియాలు సమావేశం మాట్లాడారు. ప్రభుత్వం రైతులు పండించిన సోయాలను ఎకరంకు ఆరు క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తామని చెప్పడంలో అర్థం లేదన్నారు. ఎన్నికల కంటే ముందు రైతులు పండించిన పంటను కొనుగోలు చేస్తామన్న కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి వచ్చిన మాట తప్పుతున్నారన్నారు. రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు. సోయా పంటకు మద్దతు ధర రూ.4892తో పాటు ప్రభుత్వం అందిస్తామని చెప్పిన క్వింటాలుకు అదనంగా రూ.500బోనస్ కలిపి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆంక్షాల పేరుతో రైతులను మోసం చేస్తుందన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు నల్ల రమేష్, బాలె భూపాలరాజ్, దొల్ల రాజేశ్వర్, గంగారెడ్డి, రేగుల్ల రాములు, తదితరులు పాల్గొన్నారు.

జీవితంపై విరక్తిచెంది వ్యక్తి ఆత్మహత్య

ధర్పల్లి, అక్టోబరు5: జీవితంపై విరక్తిచెంది మండలంలోని గుడితండాకు చెందిన బాదావత్ నాందేవ్ (47) పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై రామకృష్ణ శనివారం తెలిపారు. తాండాకు చెందిన నాందేవ్ మద్యానికి బానిసై పలుమార్లు చనిపోతానంటూ అనేవాడని ఆయన పేర్కొన్నారు. ఉదయం కూరగాయలు అమ్మడానికి వెళ్లిన నాందేవ్ భార్య ఇంటికి రాగా పురుగుల మందు సేవించినట్లు గుర్తించిన ఆమె జిల్లా ఆసుపత్రికి తరలిస్తుండగా చనిపోయినట్లు తెలిపారు. మృతుడి భార్య జెస్సీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



పరిశీలిస్తున్న డాక్టర్ అజయ్‌కుమార్

జీజీహెచ్‌లో ప్రత్యేక ఫీవర్ వార్డు ఏర్పాటు

● పరిశీలించిన తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్

పెద్దబజార్, అక్టోబరు 5: తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు అందించే ఆరోగ్య సదుపాయాలను తెలంగాణ వైద్యవిధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ శనివారం పరిశీలించారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సీజనల్ జ్వరాల మీద ప్రత్యేక దృష్టితో ఫీవర్‌వార్డును, ఇతర వార్డులను ఏర్పాటుచేశారు. అనంతరం రోగులతో మాట్లాడి వైద్య సేవలు ఎలా అందుతున్నాయో అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ రోగులకు ఆసుపత్రిలో మెరుగైన చికిత్స అందుతుందని అన్ని రకాల వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్ పవర్ పాయింట్ ద్వారా ఆసుపత్రికి అవసరమైన మౌలిక సదుపాయాలను, ఇతర అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సానుకూలంగా స్పందించి మంత్రి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. కార్యక్రమంలో డిఎంహెచ్‌వో డాక్టర్ రాజశ్రీ, డిసిహెచ్ శ్రీనివాస్, నాగరాజు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం

పెద్దబజార్, అక్టోబరు 5: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారత కోసం ఏర్పాటు చేస్తున్న మహిళా శక్తి క్యాంటీన్‌ను ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రతిమరాజ్ ప్రారంభించారు. శనివారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ప్రభుత్వ ఆదేశాల మేరకు మహిళా శక్తి పథకం కింద క్యాంటీన్‌ను ప్రారంభించడం జరిగిందని ఆమె పేర్కొన్నారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.95	రూ.220	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	రూ.100	రూ.225	రూ. 250

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.78,500	రూ.72,500	రూ.960

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : దేవర (11.15, 2.50, 6.25, 10.00)
స్క్రీన్-2 : స్వాగ్ (12.25, 7.00)
: జోకర్ (ఇంగ్లీష్) (3.45)
: సత్యం సుందరం (10.20)
స్క్రీన్-3 : జోకర్ (ఇంగ్లీష్) (12.35, 6.00, 9.15), కాళీ (3.50)
స్క్రీన్-4 : బహిర్భూమి (11.05)
: మిస్టర్ సెలెబ్రిటీ (1.45)
: చిట్టి పొట్టి (4.30)
: దక్షిణ (7.30)
: రాంనగర్ బన్నీ (10.00)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : దేవర (12.55, 4.10, 7.20, 10.30)
స్క్రీన్-2 : దేవర (10.30)
: సత్యం సుందరం (1.40, 4.40, 7.30, 10.30)
స్క్రీన్-3 : స్వాగ్ (10.25, 1.30, 4.30, 7.30, 10.30)

దేవి : స్వాగ్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : సత్యం సుందరం (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : దేవర (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్: దేవర (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్